నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 గురువారం 21 మార్చి 2024 MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## ఆదివాసీల అభ్యున్నతికి కృషి

**ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా**



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఆసిఫాబాద్,మార్చి 20: ఆదివాసీల అభ్యున్నతికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. మండలంలోని రౌట సంకెపల్లి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేర్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గిరిజన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వివరించారు. ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, ఎంపీటీసీ సత్రవేణి మల్లేశ్, అసిస్టెంట్ ఇంజినీర్ నజీమొద్దీన్ తదితరులున్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రం వద్ద మాట్లాడుతున్న డీసీపీ అశోక్ కుమార్

కోటపల్లి, మార్చి 20 : తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్ బుధవారం పరిశీలించారు. అన్నారం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన డీసీపీ, భద్రతా చర్యలపై ఆరా తీశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం రాపనపల్లి సమీపంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్దకు చేరుకొని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్ ఉన్నారు.



## అడవిని కాపాడుకుందాం..

**● లేదంటే జీవ వైవిధ్యానికి విఘాతం ● నేడు ప్రపంచ అటవీ దినోత్సవం**

*అడవి అమ్మలాంటిది. అన్ని జీవులను అక్కున చేర్చుకుంటుంది. ఆహారం, ఔషధాలను ఇస్తుంది. ఆశ్రయంతోపాటు మానవుడి మనుగడకు కావాల్సిన ప్రాణవాయువును పంచుతుంది. ప్రస్తుతం అడవులను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలి. నేడు(గురువారం) 'ప్రపంచ అటవీ దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం..*

మంచిర్యాల అర్బన్, మార్చి 20: అడవులు మానవుడితోపాటు సకల జీవకోటి మనుగడకు ఆధారం. నేటి ఆధునిక మానవుడు తన విజ్ఞానంతో వనరులను విపరీతంగా వినియోగించుకుంటున్నాడు. అటవీ సంపదను నాశనం చేస్తూ తన మనుగడని ప్రశ్నార్థకం చేసుకుంటున్నాడు. ఎన్నో జీవులకు రక్షణగా ఉండే అడవి ఆవరణ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాడు. జీవుల మనుగడకు ఆధారమైన ఆహారపు గొలుసును కాపాడే వనాలను విచ్చలవిడిగా నరికి వేస్తూ సకల జీవ కోటి వినాశనానికి కారణమవుతున్నాడు.

### అడవుల పరిరక్షణ...

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ ప్రభుత్వం అడవులు, మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవడంతో అడవుల శాతం పెరిగింది. కానీ కొందరు స్మగ్లర్ల ధనదాహానికి అడవి బలైపోతున్నది. ఒక చెట్టు నరికితే రెండు మొక్కలు నాటి వాటిని కాపాడాలని, రహదారుల పక్కన పెద్ద చెట్టును తొలగిస్తే తొమ్మిది మొక్కలు నాటి పెద్దగా ఎదిగేంత వరకు సంరక్షించాలని పర్యావరణ చట్టాలు చెబుతున్నా, పాలకుల చెవులకు వినపడడం లేదు.

### అటవీ సంపదతో ఎన్నో లాభాలు..

ఆహారం, ఆశ్రయం, ఔషధాలు, కలప, కాగితం, పండ్లు, పట్టు, తేనే, జిగురు, సుగంధ ఉత్పత్తులు తదితర ఎన్నో అడవుల్లో లభిస్తాయి. జంతువులు వదిలే కార్బన్‌డయాక్సైడ్‌ను గ్రహించి మనకు అవసరమైన ప్రాణ వాయువును అందిస్తాయి. బాగా పెరిగిన ఒక చెట్టు సుమారు 25 వేల కిలో మీటర్లు తిరిగిన కాలుష్యాన్ని నివారిస్తుంది. ఒక హెక్టారు గ్రీన్ బెల్ట్ ఏరియా 30 నుంచి 50 టన్నుల దుమ్ము కణాలను పీల్చుకుంటుంది. 100 చదరపు మీటర్లు ఆవరించి ఉన్న చెట్టు ఆకులు ప్రతి రోజు కిలో గ్రామ్ ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది. అందుకే అడవులను కాపాడుకోవడం బాధ్యతగా తీసుకోవాలి.

జప్తు చేసేందుకు బయటకు తీసుకెళ్తున్న ప్రింటర్లు, కుర్చీలు



# ఆర్డీవో కార్యాలయ ఆస్తులు అటాచ్!

## మంచిర్యాల సబ్ కోర్టు సంచలన ఆదేశాలు

**● ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ జిల్లా అధికార యంత్రాంగం ● నాటకీయ పరిణామాల మధ్య తిరిగి వెళ్లిపోయిన కోర్టు సిబ్బంది**

మంచిర్యాల, మార్చి 20(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల ఆర్డీవో కార్యాలయాన్ని జప్తు చేయాలని మంచిర్యాల సబ్ కోర్టు సంచలన ఆదేశాలు ఇచ్చింది. బాధితులు, వారి తరపు అడ్వొకేట్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పారుపల్లి గ్రామంలోని 479, 480 సర్వే నంబర్లలో అజ్మీరా బేగం అనే మహిళకు 23 ఎకరాల 27 సెంట్ల భూమి ఉంది. 1982లో అప్పటి ప్రభుత్వం ఈ భూమిని మల్బరీ ప్లాంటేషన్ కోసం సేకరించింది. బాధితులకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండానే అధికారులు భూమిని స్వాధీనం చేసుకున్నారు. డబ్బులు చెల్లించాలంటూ ఎన్ని దరఖాస్తులు చేసినా అప్పుడున్న ఆర్డీవో పట్టించుకోకపోవడంతో చివరకు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ప్రభుత్వం అసలు అజ్మీరా బేగం ఆ భూమి యజమానే కాదంటూ కోర్టుకు వివరణ ఇచ్చినట్లు తెలిసింది. ఈ అంశంపై న్యాయపోరాటం చేసిన బాధితులు ఆసిఫాబాద్ జిల్లా కోర్టులో భూమికి ఓనర్లుగా డిక్లేర్ అయ్యారు. కానీ.. ఆర్డీవో కార్యాలయ అధికారులు మాత్రం దాన్ని పరిగణలోకి తీసుకోలేదు. దీంతో కోర్టు ఆదేశాలను పట్టించుకోవడం లేదంటూ బాధితులు మరోసారి హైకోర్టుకు వెళ్లారు. ఇలా ఎన్నో సంవత్సరాల న్యాయపోరాటం అనంతరం 2007లో అప్పటి కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు బాధితుల తరపు అడ్వొకేట్ పసుల సురేశ్ తెలిపారు. కోర్టు ఆదేశాల ప్రకారం రూ.2.92 కోట్లు చెల్లించాల్సి ఉన్నా అధికారులు నిర్లక్ష్యం చేస్తూ వచ్చారన్నారు. చివరకు 2017లో బాధితులు మరోసారి హైకోర్టుకు వెళ్లారని చెప్పారు. అనేక వాదోపవాదనల అనంతరం హైకోర్టు డివిజన్ బెంచ్ నుంచి కేసు మంచిర్యాల సబ్ కోర్టుకు చేరిందన్నారు. హైకోర్టులో కేసును డిస్మిస్ చేసిన దృష్ట్యా బాధితులకు డబ్బులు చెల్లించాల్సిందేనంటూ ఆర్డీవోను సబ్‌కోర్టు ఆదేశించిందన్నారు. ఇందుకోసం మూడు నెలల సమయం ఇస్తూ అక్టోబర్‌లో ఫైనల్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. మూడు నెలల్లో డబ్బులు చెల్లించకపోతే ఆర్డీవో కార్యాలయ ఆస్తులు అటాచ్ చేస్తామని ఆర్డర్‌లో స్పష్టంగా చెప్పడం జరిగిందన్నారు. కోర్టు ఆదేశాలను అధికారులు పట్టించుకోకపోవడం, వారి నుంచి కనీస స్పందన లేకపోవడంతో కార్యాలయ ఆస్తులను జప్తు చేసేందుకు కోర్టు సిబ్బంది వచ్చినట్లు ఆయన తెలిపారు.



ఆర్డీవో కార్యాలయంలో కంప్యూటర్లు, ప్రింటర్లు, సీపీయూలను జప్తు చేసేందుకు తీస్తున్న సిబ్బంది



కోర్టు సిబ్బందితో మాట్లాడుతున్న బాధితులు, వారి తరపు న్యాయవాది

### మధ్యలోనే ఆపేసి ఎందుకు వెళ్లినట్లో?

కోర్టు ఆదేశాల మేరకు బుధవారం ఆర్డీవో కార్యాలయంలోని చరాస్తులను జప్తు చేసేందుకు కోర్టు సిబ్బంది వచ్చారు. కొన్ని కుర్చీలు, టేబుల్స్, కంప్యూటర్‌లకు కేసు నంబర్, ఇతర వివరాలను అంటించారు. సీరియల్ నంబర్ల వారీగా వస్తులను బయటికి తీసుకొచ్చి ఆ వివరాలను నోట్ చేసుకున్నారు. కానీ.. ఉన్నట్టుండి పైనుంచి ఆదేశాలు వచ్చాయంటూ అప్పటి వరకు చేసిన పనిని మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. దీంతో బాధితులు, వారి తరపు న్యాయవాది ఎవరు ఆపమన్నారో వివరంగా ఒక పేపర్‌పై రాసిచ్చి వెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆర్డీవోను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన వేరే మార్గం గుండా బయటికి వెళ్లిపోయారు. మీడియాతో మాట్లాడేందుకు ఇష్టపడలేదు. ఆర్డీవో వెళ్లిపోయిన అనంతరం బాధితులు మాట్లాడుతూ.. అజ్మీరా బేగం వయసు ఇప్పుడు 93 ఏండ్లని ఆమె ఆరోగ్య పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందన్నారు. 42ఏండ్లుగా న్యాయం కోసం చేస్తున్న పోరాటానికి ఇప్పటికైనా సరైన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పరిహారం ఎప్పుడు ఇస్తారో నోటి మాటగా కాకుండా ఒక పేపర్‌పై ఇవ్వాలని కోరితే ఆర్డీవో తనకు సంబంధం లేదన్నట్లుగా మాట్లాడుతున్నారన్నారు. కలెక్టర్ చెప్పంది తాను ఇవ్వలేనని ఆర్డీవో చెప్పారని, కోర్టు ఆర్డర్ ఇచ్చాక మళ్లీ ప్రత్యేకంగా కలెక్టర్ చెప్పాల్సిన అవసరం ఏం వచ్చిందో తమకు అర్థంకావడం లేదని వాపోయారు. కాగా.. ఈ విషయంలో కనీస బాధ్యత లేకుండా ఆర్డీవో, కార్యాలయ సిబ్బంది వ్యవహరించడం, మీడియా చూస్తుండగానే అనేక నాటకీయ పరిణామాల మధ్య జప్తును ఆపేసి వెళ్లడానికి కారణాలు ఏంటనేది తెలియరాలేదు.



కార్యాలయం నుంచి వెళ్లిపోతున్న ఆర్డీవో

## రికార్డులున్నాయా.. మాయం చేశారా?

**భూసేకరణ అక్రమాలపై వాయిదా పడిన విచారణ**

మంచిర్యాల, మార్చి 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): శ్రీరాంపూర్, ఇందారం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల భూసేకరణలో జరిగిన అక్రమాలపై 'అనర్హులకు అందలం.. అర్హులకు మంగళం'' శీర్షికన నమస్తే తెలంగాణ కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. గతంలో మంచిర్యాల ఆర్డీవోగా పని చేసిన దాసరి వేణు, డిప్యూటీ తహసీల్దార్ కమల్‌సింగ్ ఈ భూ సేకరణలో పలు అక్రమాలకు పాల్పడ్డారని బాధితులు హైదరాబాద్ ప్రజావాణిలో సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దాదాపు 13 అంశాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేయడంతో దీనిపై పూర్తిస్థాయి విచారణ చేసి రిపోర్ట్ ఇవ్వాలని విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్‌ను కోరింది. ఈ మేరకు అదనపు కలెక్టర్ రాహుల్‌ను విచారణ అధికారిగా నియమించారు. బుధవారం వీటికి సంబంధించిన డాక్యుమెంట్లు, రికార్డులు తీసుకొని విచారణకు రావాలంటూ పాత ఆర్డీవో వేణు, డీటీ కమల్ సింగ్‌తో పాటు ఫిర్యాదుదారులకు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు వారంతా విచారణకు వచ్చారు. కాకపోతే ఆర్డీవో కార్యాలయం నుంచి రావాల్సిన డాక్యుమెంట్లు అందకపోవడంతో విచారణను వాయిదా వేసినట్లు అదనపు కలెక్టర్ రాహుల్ తెలిపారు. కాగా ఇందుకు సంబంధించిన రికార్డులు ఆర్డీవో కార్యాలయంలో ఉన్నాయా.. ఉద్దేశపూర్వకంగానే వాటిని మాయం చేశారా అనేది తెలియడం లేదు. ఈ వ్యవహారంలో పాత ఆర్డీవో వేణుతో పాటు మరికొందరు రెవెన్యూ అధికారులపై చర్యలు తప్పేలా లేవని, అందుకే రికార్డులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఫిర్యాదు విషయంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ సహా రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తున్నది.

## మంచిర్యాల-అంతర్గాం బ్రిడ్జిని వెంటనే పూర్తిచేయాలి

**● ప్రజలందరికీ అనుకూలమైన చోటే వంతెన నిర్మించాలి ● మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు**



గోదావరిలో వంతెన నిర్మించాల్సిన ప్రాంతంలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, మార్చి 20: నిధులు మంజూరై, టెండర్ ప్రక్రియ పూర్తయి, అన్ని టెస్టులు పూర్తి చేసుకొని ఉన్న మంచిర్యాల-అంతర్గాం బ్రిడ్జి పనులను వెంటనే పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్ చేశారు. వంతెన నిర్మించాల్సిన ప్రదేశంలో బుధవారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. అనంతరం అక్కడే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంచిర్యాల- అంతర్గాం మధ్య గోదావరిపై వంతెన నిర్మించాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరగానే, ఆయన మంజూరు చేశారని తెలిపారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే మంచిర్యాల, పెద్దపల్లి జిల్లా కేంద్రాల మధ్య దాదాపు 20 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని, దీంతో ఆర్థిక వ్యయం, ప్రయాణ ప్రయాసలు కూడా తగ్గుతాయని అన్నారు. ఇక్కడ వంతెన నిర్మిస్తేనే ప్రజలందరికీ మేలు కలుగుతుందని, అనవసరంగా భేషజాలకు పోయి ఇతర ప్రాంతానికి మారిస్తే ఇప్పట్లో పనులు పూర్తికాకపోగా ఎలాంటి ఉపయోగం ఉండదని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, మంచిర్యాల గోదావరి వద్దే వంతెనను నిర్మించాలన్నారు. ఇప్పటికే అంతర్గాం నుంచి బసంత్‌నగర్ వరకు రెండు వరుసల రోడ్డు పూర్తయి ఉన్నదని, ఇవతలి పక్క చిన్న భూసేకరణ చేపడితే సరిపోతుందని చెప్పారు ట్రాఫిక్ ఇబ్బందులు అంటూ అనవసర అనుమానాలు అవసరం లేదని, కుర్మపల్లి దగ్గర నుంచి ఎటు వెళ్లాల్సిన వాహనాలు అటువైపు వెళ్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం నీటిప్రవాహం తక్కువగా ఉందని, పనులు త్వరగా చేపట్టాలని , వేసవికాలం ముగిసే సరికి పిల్లర్ల నిర్మాణం పూర్తయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో నడిపెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ నడిపెల్లి విజిత్‌రావు, బీఆర్‌ఎస్ మంచిర్యాల పట్టణాధ్యక్షుడు గాదెసత్యం, నస్పూర్ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, హాజీపూర్ మండలాధ్యక్షుడు మొగిలి శ్రీనివాస్, నాయకులు మందపల్లి శ్రీనివాస్, కౌన్సిలర్ అంకం నరేశ్, తోట తిరుపతి, శ్రీరాముల మల్లేశ్, తాజుద్దీన్, ఎర్రం తిరుపతి, సుంకరి రమేశ్, గట్టయ్య, రమేశ్ యాదవ్, రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు బీఆర్‌ఎస్ పార్టీ సమావేశాలు

చెన్నూర్/మందమర్రి, మార్చి 20: చెన్నూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, బీఆర్‌ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ గురువారం పర్యటించనున్నారు. పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా నియోజకవర్గంలోని పలు చోట్ల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేయనున్నారు. ఉదయం 9 గంటలకు మందమర్రి పట్టణంలోని బీ-1పార్టీ కార్యాలయంలో, 10 గంటలకు రామకృష్ణాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో, 11 గంటలకు జైపూర్‌లోని పార్టీ మండల అధ్యక్షుడు అరవింద్ రావు ఇంటి వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు చెన్నూర్ పట్టణంలోని సంతోషిమాత ఫంక్షన్ హాల్‌లో చెన్నూర్ మున్సిపాలిటీ, చెన్నూర్, కోటపల్లి, భీమారం మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించే సమావేశంలో వారు పాల్గొంటారు. ఈ సమావేశాలకు నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి, యువజన, మహిళ, సోషల్ మీడియా, టీబీజీకేఎస్, అనుబంధ సంఘాల సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయించండి

**సీఎండీ బలరాం నాయక్‌ను కోరిన రెడ్‌క్రాస్ సొసైటీ**

మంచిర్యాల ఏసీసీ, మార్చి 20: సింగరేణిలో కొత్త కార్మికుల ద్వారా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయించాలని సింగరేణి సీఅండ్‌ఎండీ బలరాం నాయక్‌ను మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో బుధవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామగుండం1,2 ఏరియాలో యువ కార్మికులతో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయించాలని కోరినట్లు తెలిపారు. గతంలో సింగరేణి మందమర్రి, శ్రీ రాంపూర్ వృత్తి శిక్షణ కేంద్రంలో యువ కార్మికులతో రక్తదాన శిబిరాలు నిర్వహించేవారని వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎండీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. జైపూర్ పవర్‌ప్లాంట్ ద్వారా అందించిన అంబులెన్స్, వైద్య పరికరాలు చాలా ఉపయోగపడుతున్నాయని, ఈ సందర్భంగా సీఎండీకి కృతజ్ఞతలు తెలిపారు.

## వడ్ల బస్తాలు దొంగలిస్తున్న ఐదుగురి అరెస్ట్

**రూ. 59 వేల నగదు, 20 వడ్ల బస్తాలు స్వాధీనం**

భీమారం, మార్చి 20: కొంతకాలంగా వడ్ల బస్తాలను దొంగతనం చేస్తూ అమ్ముకుంటున్న దొంగల ముఠాను భీమారం పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీరాంపూర్ సర్కిల్ సీఐ డీ మోహన్, భీమారం ఎస్ఐ రాములు బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భీమారం మండల కేంద్రంలోని కొత్తగూడెం కాలనీకి చెందిన మల్లెత్తుల ప్రశాంత్, మండల కేంద్రానికి చెందిన దాసరి చంద్రమౌళి, పందుల మధుకర్, బొంతల మధుకర్, మల్లెత్తుల రమేశ్ వ్యవసనాలకు బానిసై స్థానికంగా ఉన్న గోడౌన్‌లో కొన్ని నెలలుగా వడ్లను దొంగలిస్తున్నారు. దొంగలించిన వడ్లను మహారాష్ట్రలోని బ్రోకర్లకు అమ్ముతుండేవారు. ఇదే క్రమంలో హాజీపూర్ మండలంలోని నర్సింగాపూర్‌లోని దుర్గ ఇండస్ట్రీ పోలంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దర్శనాల రమేశ్‌ది కాగా, 2022-23కి చెందిన వరిధాన్యాన్ని ఇక్కడ భద్రపరుచుకుంటున్నాడు. ఈ నెల 16న రాత్రి 10.30 గంటలకు గోడౌన్‌కు రెండు ట్రాలీల్లో(టీఎస్ 19టీ-5991, టీఎస్11 యూసీ 1157) ఐదుగురు వచ్చారు. గోదాం తాళాలను పగులగొట్టి 20 వడ్ల బస్తాలను ట్రాలీలో వేసే క్రమంలో స్థానికుడు ఎరుకలి కొండయ్య చూసి దర్శనాల రమేశ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. దీంతో దర్శనాల రమేశ్ ఈ నెల 17న పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. ఐదుగురు నిందితులను పట్టుకొని, రెండు ట్రాలీ ఆటోలు, రూ. 59 వేలు, 20 వడ్ల బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా, ఇందులో మల్లెత్తుల ప్రశాంత్ కొంతకాలంగా గోదాం వర్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.



విలేకర్ల సమావేశంలో నిందితులను చూపిస్తున్న శ్రీరాంపూర్ సీఐ డీ మోహన్, ఎస్ఐ రాములు



జన్నారం : తిమ్మాపూర్‌లో వడగండ్ల వానకు నేలకొరిగిన మక్క పంట



దండేపల్లి : రోడ్డుపై విరిగిపడిన చెట్లు

## అకాల వర్షం.. పంటకు నష్టం..

**● పలు గ్రామాల్లో వడగాండ్ల వాన ● ఈదురుగాలులతో నేలకొరిగిన మక్క ● నేలరాలిన మామిడి**

జన్నారం, మార్చి 20: మండలంలోని తిమ్మాపూర్‌లో బుధవారం మధ్యాహ్నం కురిసిన వడగండ్ల వానకు రైతులు వేసుకున్న మక్క పంట నేలపాలైంది. రైతులు జే మల్లేశ్ 2 ఎకరాలు, కే శంకర్‌కు చెందిన 4 ఎకరాల మక్క పంటకు నష్టం వాటిల్లింది. రాష్ట్ర ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

కౌటాల, మార్చి 20: మండలంలో మంగళవారం రాత్రి కురిసిన గాలి వర్షానికి మిరప, మామిడికి నష్టం వాటిల్లింది. ముత్తంపేట గ్రామంలో రైతులు మిరప పంటను ఎండబెట్టగా, వర్షపు నీటిలో తడిశాయి. ఈదురు గాలులకు మామిడి కాయలు నేల రాలాయి. చేతికొస్తున్న పంట అకాల వర్షానికి నష్టపోతుండడంతో రైతులంతా ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

దండేపల్లి, మార్చి 20: మండలంలోని తాళ్లపేట, నాగసముద్రం గ్రామాల్లో వడగండ్ల వాన కురిసింది. మ్యాదరిపేట, చింతపల్లి, తాళ్ల పేట గ్రామాల్లో కొంత మంది రైతుల మక్క పంట నేలకొరిగింది. నర్సాపూర్‌లో శ్రీనివాస్‌కు చెందిన నాలుగు మేకలు, సత్తయ్యకు చెందిన మూడు మేకలపై పిడుగు పడడంతో అక్కడికక్కడే చనిపోయాయి. సుమారు రూ. 80 వేల నష్టం వాటిల్లిందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. నెల్కి వెంకటాపూర్ జాతీయ రహదారిపై చెట్లు విరిగపడడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు వచ్చి చెట్లను తొలగించారు.



కౌటాల: ముత్తంపేటలో వర్షానికి తడిసిన మిరప

## చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

**-కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే**

రెబ్బెన, మార్చి 20: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకటేశ్ దౌత్రే స్పష్టం చేశారు. రెబ్బెన మండలంలోని గోలేటి సీహెచ్‌పీ, రేపల్లెవాడ చెక్‌పోస్టులను ఎస్పీ సురేశ్ కుమార్, అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. అక్రమ నగదు, మద్యం, కానుకల రవాణాను అరికట్టలని సూచించారు. సరైన ఆధారాలు లేకుంటే సీజ్ చేయాలని ఆదేశించారు. అనంతరం గంగాపూర్ ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శంకరమ్మ, సీఐ చిట్టిబాబు, ఎస్ఐ చంద్రశేఖర్ ఉన్నారు.



గోలేటి సీహెచ్‌పీ వద్ద సూచనలు చేస్తున్న కలెక్టర్, ఎస్పీ